క్లుప్తంగా

క్యాంపస్ ఎంపికలో ఉద్యోగ అవకాశాలు



గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల్లో సోమవారం జరిగిన క్యాంపస్ ఎంపికలో 30 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. బెంగళూరుకు చెందిన రైసెక్స్ టెక్నాలజీ కంపెనీ నిర్వహించిన ఈ క్యాంపస్ సెలక్షన్స్‌లో మొత్తం 180 మంది వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా 30 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ అనిరుద్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను ఆదరించాలి



గుడివాడ టౌన్: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో మనోధైర్యాన్ని నింపి ఆదరించాలని విజయవాడ దివ్య డెంటల్ కేర్ వైద్య నిపుణుడు డాక్టర్ సీహెచ్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో ఎయిడ్స్ డేను పురస్కరించుకుని సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌కు గురైన వారు ఏడాదికి ఒకసారి సిడి–4 పరీక్షలు చేయించుకోవాలన్నారు. కౌంట్ 250 లోపు ఉంటే చికిత్స ప్రారంభించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

తేమశాతం నిబంధన సడలించాలి


గుడివాడ టౌన్: ధాన్యం కొనుగోలు విషయంలో తేమ శాతం నిబంధనలో సడలింపులు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం కౌలు రైతులు ధర్నా చేశారు. రైతులు మాట్లాడుతూ ధాన్యం తేమశాతం నిబంధన 48 గంటల్లో సడలించాలని కోరారు. 100 కిలోల ధాన్యానికి రూ. 3 వేలు గిట్టుబాటు ధర చెల్లించాలన్నారు. కౌలురైతు చట్టం ముసాయిదాలో యజమాని సంతకం నిబంధన తీసివేసి 33 లక్షల మంది కౌలు రైతులకు కౌలు కార్డులు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జొన్నపాడు కౌలురైతు సంఘం నాయకులు వి. జనార్దన్, పి.వెంకటేశ్వరరావు, ఎల్. రాంబాబు, బి. అరుణ, బీవీ శ్రీనివాస్, నీలం మురళీకృష్ణారెడ్డి, పి. వెంకటేశ్వరరావు, డి. గోవర్ధనరావు పాల్గొన్నారు.

కూనపురెడ్డికి డీఎన్నార్ పరామర్శ



ముదినేపల్లి రూరల్: స్థానిక స్వామ్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సోమవారం పరామర్శించారు. కూనపురెడ్డి తల్లి ఇటీవల మరణించారు. పరామర్శించిన వారిలో డీఎన్నార్‌తో పాటు పార్టీ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, నాయకులు మోట్రు ఏసుబాబు, శీలం రామకృష్ణ, అల్లాడి సతీష్, వసంతరావు, సుబ్బారావు, కొండా, రామకృష్ణ, ప్రభు, దాసు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట



కైకలూరు: స్థానిక ఏలూరు రోడ్డు కాలువ గట్టు సమీపంలో సంతాన నాగేంద్రస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం గోపూజ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, అఖండ స్థాపన, అగ్నిప్రతిష్టాపన పూజలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చావలి శంకరశాస్త్రి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. బుధవారం ఉదయం 8.46 గంటలకు సంతాన నాగేంద్రస్వామి, శిఖర, నాగబంధ, మయూర వాహన ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాలువలో పూడిక తొలగింపు

మండవల్లి: మండవల్లి సెంటర్‌లోని కొత్తచెరువు (మంచినీటి చెరువు)కు నీరు వెళ్లే కాలువను సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో సోమవారం జేసీబీతో బాగు చేయించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు మద్దతు కరువు

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనల కొర్రీ

ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడిసి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరోపక్క ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తీసుకెళితే తేమ శాతం అధికంగా ఉందని తదితర నిబంధనలతో ధర తగ్గించేస్తున్నారు. కొంతమందికి గోనె సంచులను కూడా సరఫరా చేయకపోవడంతో తమకు ప్రభుత్వం మద్దతు ఇవ్వడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆగినపర్రు రైతు సేవా కేంద్రంలో ధాన్యాన్ని కాటా వేస్తున్న కూలీలు

పమిడిముక్కల: మండలంలో 20 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. వరికోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో తుపాను ప్రభావంతో వర్షం పడటం, గాలులు వీయడంతో వరిపైరు నేలవాలింది. కోతకోసి పనలపై ఉన్న వరిపంట తడిసిపోవడంతో ఆరబెట్టుకునే పనిలో రైతులు ఉన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఈ సీజన్‌లో ఎక్కువ శాతం యంత్రాలతోనే నూర్పిడులు చేస్తున్నారు. 20 వేల ఎకరాలకు గాను ఇప్పటివరకు 12 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తి చేశారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు వాహనాలు, గోనె సంచులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యంత్రంతో నూర్చిన వెంటనే మిల్లుకు తరలించేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకుని తేమశాతం పరీక్షించి మిల్లులకు తరలించడం ప్రహసనంలా మారింది.

కౌలు రైతుల బాధలు

ఇక కౌలు రైతుల బాధలు వర్ణనాతీతం. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని వాపోతున్నారు. మిషన్లతో నూర్పిడులు చేయడం వల్ల పనుల్లేక పస్తులుండాల్సి వస్తోందని వ్యవసాయ కూలీలు చెబుతున్నారు. సకాలంతో ధాన్యం కొనుగోలు చేసి, మద్దతు ధర దక్కేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తేమ శాతం ఎక్కువ అని ధర తగ్గింపు

జిల్లాలో మిల్లర్లు ధాన్యం తీసుకోకపోవడంతో పక్క జిల్లాలైన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు తరలిస్తున్నారు. మిల్లుల వద్ద ధాన్యం లోడ్‌తో రోజుల తరబడి ఉండాల్సి వస్తుందని రైతులు తెలిపారు. ఇంత కష్టపడి ధాన్యం మిల్లుకు తరలించినా తేమశాతం ఎక్కువగా ఉందని బస్తాకు రూ.200 నుంచి 400 వరకు కోత కోస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పమిడిముక్కల నుంచి ధాన్యాన్ని రాజమండ్రి మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీలు

ఎక్కడి ధాన్యం అక్కడే

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రైతులు యంత్రాల ద్వారా వరి కోతలు కోసి ధాన్యాన్ని కల్లాల్లో ఉంచారు. నాలుగు రోజులు కాటాలు జరగక, సంచులు లేక ఎక్కడ ధాన్యం అక్కడే ఉంచారు. మిల్లర్లు తేమ శాతం ఎక్కువగా ఉందని చెప్పడంతో ఆరబెట్టిన ధాన్యం వర్షం పడి తడిసిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మిల్లర్లు తేమ శాతం అధికంగా ఉందని.. సగానికి సగం రేటే ఇస్తామని అంటున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



వెంట్రప్రగడలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

కౌలు రైతుకు మిగిలేదేమీ లేదు



నాలుగెకరాల పొలం కౌలుకు తీసుకొని వరిసాగు చేశాను. రూ.1.20 లక్షలు ఖర్చు చేశా. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వచ్చింది. 20 బస్తాలు కౌలు చెల్లించాల్సి ఉంది. తేమ శాతం ఎక్కువగా ఉందని ధరలో కోత పెట్టారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– అర్జా రామారావు, కౌలురైతు, మామిళ్లపల్లి

పనుల్లేక అవస్థలు పడుతున్నాం



నేను 40 ఏళ్లుగా వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాను. గతంలో సంవత్సరమంతా ఏదో ఒక పనిచేసేవాళ్లం. వ్యవసాయం చేద్దామంటే గిట్టుబాటు కాక నష్టాలు వస్తున్నాయి. యంత్రాల రాకతో పనులు దొరకని పరిస్థితి నెలకొంది. చేతిలో డబ్బుల్లేక అవస్థలు పడుతున్నాం.

– కాకుళ్ల సోమయ్య, వ్యవసాయ కూలీ, అగినపర్రు

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ధాన్యం కొనుగోలు, తరలింపులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. పక్కనున్న తూర్పు, పశ్చిమ జిల్లాలకు ధాన్యం తరలింపు చేపట్టాం. తేమ శాతాన్ని బట్టి ధర లభిస్తుంది. ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది. గోనె సంచుల కోసం ఎప్పటికప్పుడు ఇండెంట్ పెడుతున్నాం.

– గణేష్‌రెడ్డి, ఏఓ, పమిడిముక్కల

వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు

పామర్రు(తోట్లవల్లూరు): డిజిటల్ గ్రీన్ సంస్థ మూడు సంవత్సరాలుగా వివిధ ఉద్యాన పంటలకు సంబంధించి కృత్రిమ మేధస్సును రంగరించి రైతులకు అందిస్తోందని ఉద్యాన అధికారి చందు జోసఫ్ సుందరం పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలం బద్రిరాజుపాలెంలోని రైతు సేవా కేంద్రంలో ఉద్యాన శాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి 1.0లో మిరప పంటలు పండించే రైతులకు తాము విత్తనం నాటక ముందు నుంచి కోత కోసి అమ్ముకునే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అన్ని వీడియోల రూపంలో తెలియజేశామన్నారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి కమలాకర్ మాట్లాడుతూ రైతులకు సరికొత్త సాంకేతిక సలహాలను అందించే విధంగా ఫార్మర్ చాట్(డిజిటల్ గ్రీన్) అప్లికేషన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ అప్లికేషన్స్ ఏ విధంగా రైతులు తమ సెల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలో వివరించామన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు

గుడివాడ టౌన్: స్థానిక కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాల్లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో వెబ్ డెవలపర్ అనే అంశంపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఆపై చదువులు పూర్తి చేసిన వారు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ శిక్షణలో పాల్గొని తర్ఫీదు పొందాలని కోరారు. పూర్తి వివరాలకు 98488 19682, 96666 54641 లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని వలివర్తిపాడు సమీపంలోని బైపాస్‌రోడ్డు వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

విద్యార్థులకు ప్రతిభే ఆయుధం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయ్‌కుమార్

కైకలూరు: విద్యార్థులు తమ ప్రతిభను ఆయుధంగా మలుచుకుని స్వీయ నిర్ణయంతో అద్భుతంగా రాణించాలని ఉమ్మడి కృష్ణా జిల్లా మానవత స్వచ్ఛంద సంస్థ కెరీర్ గైడెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ సుదాబత్తుల విజయకుమార్ అన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దొడ్డిపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.విష్ణుమూర్తి అధ్యక్షతన సోమవారం 9,10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం 2023– 24 విద్యా సంవత్సరంలో 6,7, 8, 9 తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కైకలూరు మానవత స్వచ్ఛంద సంస్థ, కో–చైర్మన్ గుర్రం శ్యాంకుమార్, కన్వీనర్ తలారి వేణు గోపాలకృష్ణ, కోశాధికారి ఇమ్మడి విటల్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ధాన్య కొగోళ్లలో సమస్యలు లేకుండా చూడాలి

మహేశ్వరపురం(పెదపారుపూడి): ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలని ఎమ్మెల్యే వర్ల కుమారరాజా పేర్కొన్నారు. మండలంలోని మహేశ్వరపురంలో సోమవారం ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో నలుగురు ఎంపిక


చిరంజీవి


జ్యోతి ప్రవీణ్


రష్మిక


మోహంతి

గుడ్లవల్లేరు: బహుళ జాతీయ సంస్థ థాట్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో గుడ్లవల్లేరు ఏఏఎన్‌ఎం అండ్ వీవీఆర్‌ఎస్‌ఆర్ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ సోమవారం విలేకరులకు తెలిపారు. తమ కాలేజీ కంప్యూటర్ విభాగానికి చెందిన జి.మోహంతి, జి.రష్మిక, జి.జ్యోతిప్రవీణ్, జి.చిరంజీవి వివిధ అంశాల్లో పోటీపడి ఒక్కొక్కరికి రూ.8 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించటం హర్షదాయకమని పేర్కొన్నారు.

7న ఐక్య క్రిస్మస్

గుడ్లవల్లేరు: మాదిగ ఉద్యోగులు, బంధువుల ఉపకులాల 15వ ఐక్య క్రిస్మస్‌ను నిర్వహించుకోనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కంచర్ల సుధాకర్ తెలిపారు. గుడ్లవల్లేరులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన గుడివాడ ఎన్జీఓ హోమ్‌లో ఈ ఐక్య క్రిస్మస్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రశాంతి, ప్రభాకరరావు, సైమాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

కైకలూరు: చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థానిక ఓరియంటల్ పూర్వ విద్యార్థులు రూ.లక్ష నగదు, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో సోమవారం అందించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 2021 నుంచి 2024 వరకు ఏడాదికి ముగ్గురు చొప్పున విద్యార్థులకు వీటిని పంపిణీ చేయించారు. పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు 10 మందిని సత్కరించారు. దాతల సాయం అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, పూర్వ విద్యార్థులు ఆత్రేయశర్మ, సత్యవతి, గిరిజ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, హెచ్‌ఎం ఏ.శ్రీకృష్ణ, ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, కూటమి నేత బాబీ పాల్గొన్నారు.



నగదు బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



చటాకాయి–భుజబలపట్నం జట్ల మధ్య పోటీ

కైకలూరు: ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన తల్లి దివంగత రాజేశ్వరమ్మ మెమోరియల్ పేరుతో కై కలూరు రెవెన్యూ ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా రెండో రోజు సోమవారం కొనసాగాయి. మొత్తం 38 జట్లు పోటీ పడుతున్నాయి. మంగళవారం విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నారు. న్యాయ నిర్ణేతలుగా నాగరాజు, సుబ్బరాజు, వేణు వ్యవహరిస్తున్నారు. ఏర్పాట్లను టి.పవన్, ఎస్.సోములు, ఆర్‌కే పర్యవేక్షిస్తున్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుడ్లవల్లేరు: బాలలపై జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గుడ్లవల్లేరు శ్రీసాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్థానిక పాఠశాల్లో ఆయన సోమవారం బాలలపై జరిగే నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కానిస్టేబుల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరనీకుమా ఈ దీపం.. కార్తిక దీపం..



గుడ్లవల్లేరు మండలం పుల్లేటి కాల్వలో కార్తిక దీపాలు వదులుతున్న భక్తులు



కార్తిక పూజలు చేస్తున్న మహిళలు

కనులపండువగా పోలిస్వర్గ మహోత్సవం

గుడ్లవల్లేరు: కార్తిక మాసాన్ని సాగనంపుతూ జరిగే పోలిస్వర్గ మహోత్సవం గుడ్లవల్లేరులో సోమవారం కనులపండువగా జరిగింది. వేకువ జామునే భక్తి ప్రపత్తులతో మహిళా భక్తులు అభ్యంగన స్నానాలు ఆచరించి, కార్తిక పూజల్లో నిమగ్నమయ్యారు. 'ఆరనీకుమా ఈ దీపం కార్తిక దీపం' అంటూ మహిళలు స్థానిక రామాలయం, వార్పురోడ్డులోని పుల్లేటి కాల్వలో కార్తిక దీపాలను వదిలి, కార్తిక మాసాన్ని సాగనంపారు. వణుకు పుట్టే చలిలో జరిగిన ఈ మహోత్సవానికి అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరై, వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): పోలిస్వర్గ మహోత్సవం సందర్భంగా కూచిపూడిలోని వేదాంతం వారి చెరువులో 'కార్తిక దామోదర.. గయా దామోదర .. ఆత్మ దామోదర' అంటూ భక్తులు సోమవారం దీపాలను నీటిలో వదిలారు. మండలంలోని గూడపాడు, మొవ్వ, మొవ్వ పాలెం, కోసూరు, కాజ, నిడుమోలు తదితర గ్రామాల్లో కార్తిక దీక్షలు నిర్వహించిన మహిళలు ఈ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



కూచిపూడిలో కార్తిక దీపాలతో మహిళలు

పామర్రులో..

పామర్రు: కార్తిక మాసం పూర్తి చేసుకున్న మహిళలు పోలమ్మను స్వర్గానికి పంపే కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున స్థానిక పుల్లేరు కాలువలో స్నానాలను ఆచరించి అరిటి డొప్పలో దీపాలను వెలిగించి కాలువలోకి వదిలారు. అనంతరం స్థానిక ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు సతమతం

గుడివాడ టౌన్: తుపాను ప్రభావంతో రైతు పంట నష్టపోతుంటే మరోపక్క ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు సతమతమవుతున్నారని సీపీఎం నాయకులు అన్నారు. పట్టణంలోని రైస్ మిల్లు వద్ద నిలిచిపోయిన ధాన్యం లారీల వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగైదు రోజులుగా ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. లారీలు నిలిచిపోవడం వలన లారీ యజమానులకు రైతులకు మధ్య వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం ధాన్యం దిగుమతి అయ్యేందుకు ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. కౌలు రైతులకు ఈ పంటకు పట్టాలు కూడా ఇవ్వలేదని, ధాన్యం తడిసి లారీలలో ఉండటం వలన రంగు మారి ధర తగ్గిపోతుందన్నారు. ఈ విధంగా అనేక ఇబ్బందులకు రైతు గురవుతుంటే ప్రభుత్వం స్పష్టమైన వైఖరి చూపక నిర్లక్ష్యంగా ఉండటం సరైన విధానం కాదన్నారు. వెంటనే రైతుల కష్టాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, ఐద్వా కార్యదర్శి పి. రజిని, సాహితీ స్రవంతి కార్యదర్శి ఎల్. సురేంద్ర పాల్గొన్నారు.

సతీష్‌కు మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ

పమిడిముక్కల: పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అక్కినేని సతీష్, కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోమవారం పరామర్శించారు. అగినపర్రు వెళ్లి అక్కినేని భవాని చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, సర్పంచ్ కోట మణిరాజు పాల్గొన్నారు.



అక్కినేని భవాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఉత్సవాలు విజయవంతం చేయాలి

ముదినేపల్లి రూరల్: భక్తుల మనోభావాలకు అనుగుణంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ సూచించారు. సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక షష్ఠి కల్యాణోత్సవాలు ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయ సహాయ కమిషనర్ గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు పలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వస్తారన్నారు. ఇందుకు సంబంధించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ జెఎస్‌సుభానీ, కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ఎస్సై వీరభద్రరావు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్

కోళ్ల వ్యర్థాల వినియోగాన్ని అరికట్టండి

ముదినేపల్లి రూరల్: చేపల సాగుకు కోళ్ల వ్యర్థాల వినియోగాన్ని అరికట్టడంతోపాటు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వ ఫణేంద్ర డిమాండ్ చేశారు. ఈ అంశంపై తహసీల్దార్ సుభానీ, ఎంపీడీఓ వై రామకృష్ణకు కార్యాలయాల్లో సోమవారం ఆయన వినతిపత్రాలు అందజేశారు.

ఆస్తిపన్ను వసూళ్ల వేగవంతం

గుడివాడ టౌన్: పట్టణంలో ఆస్తిపన్ను, నీటి కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, మున్సిపల్ షాపుల అద్దె తదితర బకాయిలు వెంటనే వసూలు చేసేందుకు సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు కోరారు. సోమవారం స్థానిక 22, 30, 31 వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం ఉద్యోగులతో సమీక్ష నిర్వహించి పన్ను బకాయిలు వేగవంతం చేయాలని సూచించారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

మండవల్లి: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దివ్యాంగుల ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్‌గా నూతనంగా ఎన్నికైన బుద్దుల సురేష్ అన్నారు. మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుద్దుల సురేష్ ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరులో గత నెల 30న స్టేట్ ప్రెసిడెంట్ ఎల్లయ్య, స్టేట్ జాయింట్ సెక్రటరీ సాంబయ్య, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగినట్లు సురేష్ సోమవారం తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు పోల్‌రాజ్ కాల్వగట్టుపై నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం పంచాయితీరాజ్ ఏఈ నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ రోడ్డును రూ.52.50లక్షల ఉపాధి నిధులతో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. రోడ్డు నిర్మాణాన్ని పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.